

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

# ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం, డిసెంబర్ 27: బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా మరోసారి అధిష్టానం ప్రకటించిన సందర్భంగా మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గం ప్రధాన కార్యదర్శులు బాలకిషన్, అరవింద్‌శర్మ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఉద్యమకారుల సంక్షేమ సంఘం కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును బుధవారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు కొత్తకుర్మ కార్తీక్, ఆర్ల కృష్ణ తదితరులు సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. **- తుర్కయాంజాల్, డిసెంబర్ 27**

# ప్రజాపాలనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

■ మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి
■ అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ■ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్

రంగారెడ్డి, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతి పెంచేందుకు ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలనను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సందేశంతో కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. కౌంటర్ల ఏర్పాటు, తాగునీరు, షామియానా, బారికేడ్లను ఏర్పాటు చేయాలని, మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, ఆర్డీవోలు, తహసీలార్లు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రేపు బీఆర్‌ఎస్ పార్టీ విజయోత్సవ సభ

కందుకూరు, డిసెంబర్ 27 : బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ తెలిపారు. ఎమ్మెల్యేగా సబితాఇంద్రారెడ్డి గెలువడంతో ఆమె ఉదయం 10గంటలకు మండల పరిధిలోని కొత్తూరు గేటు వద్ద ఫార్మాసిటీ రోడ్డులో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అక్కడి నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సబితాఇంద్రారెడ్డిని కార్యకర్తలు, నాయకులు సన్మానించిన తర్వాత ఆమె విజయోత్సవ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక

కులకచర్ల, డిసెంబర్ 27: కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి బీచ్ వాలీబాల్ విభాగంలో అండర్ 19లో జాతీయ స్థాయి పోటీలకు చరణ్‌కుమార్ ఎంపికయ్యాడు. వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయిలో బీచ్ వాలీబాల్ క్రీడల్లో చరణ్ కుమార్ అత్యంత ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా చరణ్ కుమార్‌ను మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, పీడీ కృష్ణారెడ్డి అభినందించారు. జాతీయ స్థాయి క్రీడలు తమిళనాడులో జరుగనున్నాయి.



విద్యార్థి చరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

# ఇస్తరా.. ఇవ్వరా..

**'దళితబంధు' కొనసాగింపుపై నీలినీడలు**

■ ఎలాంటి ప్రకటన చేయని కాంగ్రెస్ సర్కార్
■ దళిత కుటుంబాల్లో సందిగ్ధం.. కొనసాగించాల్సిందేనంటూ వినతులు
■ రెండో విడుతకు విడుదల చేసిన రూ.60 కోట్లు వెనక్కేనా?
■ దళితబంధు నిధులు మళ్లింపు చేసినట్లు జోరుగా ప్రచారం



వికారాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన దళిత బంధు పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి.. దళిత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసిన దళితబంధు పథకాన్ని ప్రస్తుతం కొనసాగిస్తుందా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొన్నది. ఇటీవల స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు జిల్లా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశానికి కూడా ఎస్సీ కార్పొరేషన్ ఈడీని హాజరు కావాలని ఆదేశించకపోవడం గమనిస్తే దళితబంధును నిలిపి వేస్తారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దళితబంధు పథకాన్ని రద్దు చేస్తారని ప్రచారం జరుగుతుండడంతో దళిత కుటుంబాలు జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు దళితబంధు పథకాన్ని కొనసాగించాలంటూ విన్నవించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దళిత బంధు పథకం కొనసాగింపుపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

**రెండో విడుత నిధులు వెనక్కి?**

దళితబంధు పథకంలో భాగంగా మొదటి విడుత కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు వారికి నచ్చిన వ్యాపారాలు చేసుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.10లక్షలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసింది. దీంతో మొదటి విడుతలో ఎంపికైన లబ్ధిదారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. దళితబంధు రెండో విడుత ప్రక్రియను షురూ చేసే సమయంలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రక్రియ లబ్ధిదారుల ఎంపికతోనే మధ్యంతరంగా నిలిచిపోయింది. రెండో విడుత దళిత బంధు పథకం అమలుకు జిల్లాకు రూ.60 కోట్లను గత ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఈ పథకం అమలుకు సానుకూలంగా లేకపోవడంతో దళితబంధు పథకం అమలుకు విడుదలైన రూ.60 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే రూ.40కోట్లను ప్రస్తుతం వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. మరీ దళితబంధు పథకం కొనసాగనున్నదా, ఇప్పటికే విడుదల చేసిన నిధులను దళితబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు చేస్తారా అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉన్నది.

**ఆర్థిక చేయూతతో పాటు శిక్షణ**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత కుటుంబాలు ఎంపిక చేసుకున్న వ్యాపారాలకు సంబంధించి ఆర్థిక చేయూతనందించడంతోపాటు ఆయా రంగాల్లోని నిపుణులతో ప్రత్యేక అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇప్పించారు. దళిత బంధు లబ్ధిదారులు వారు ఎంచుకున్న వ్యాపారాల్లో నష్టపోతే వారిని ఆర్థికంగా అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన రక్షణ నిధి కింద రూ.35.80 లక్షల నిధులను సంబంధిత అధికారులు జమ చేశారు. మరోవైపు మొదటి విడుతలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 358 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, జిల్లాకు రూ.35.80 కోట్ల నిధులను విడుదల చేయగా, 358 యూనిట్లకు సంబంధించి జిల్లా యంత్రాంగం గ్రౌండింగ్ చేశారు. జిల్లాలో మొదటి విడుతలో మంజూరైన యూనిట్లలో వికారాబాద్ నియోజకవర్గంలో 100 మంది లబ్ధిదారులు, తాండూరులో 100, పరిగిలో 80, కొడంగల్‌లో 60, చేవెళ్లలో 18 యూనిట్ల గ్రౌండింగ్ చేశారు.

## మొదటి విడుత లబ్ధిదారుల కుటుంబాల్లో వెలుగులు

దళితబంధు పథకంలో భాగంగా మొదటి విడుతలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించిన జిల్లాలోని దళితుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. గతంలో కూలీ పని చేసి జీవనోపాధి పొందిన వారు.. దళితబంధు పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందజేయడంతో రూ.10లక్షల విలువ చేసే యూనిట్లు సొంతం కావడంతో పాటు దండిగా ఉపాధి పొందుతున్నారు. అయితే దళితబంధు పథకంతో గతంలో కారు డ్రైవర్లుగా పని చేసిన వారు... నేడు ఓనర్లయ్యారు, హోటళ్లలో పని చేసే వారు హోటళ్లకు ఓనర్లయ్యారు. అయితే జిల్లాలో లబ్ధిదారులు మినీ డెయిరీ, పౌల్ట్రీపామ్‌లతోపాటు కార్లు, ట్రాక్టర్ యూనిట్లను లబ్ధిదారులు ఎంపిక చేసుకున్నారు.

# బాధ్యతగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితాకుమారి

పెద్దేముల్, డిసెంబర్ 27 : ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి స్వీకరించే దరఖాస్తులను పకడ్బందీగా బాధ్యతాయుతంగా స్వీకరించాలని ప్రజాపాలన మండల ప్రత్యేక అధికారి, సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితాకుమారి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మొదటి విడుత, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు రెండో విడుతలో దరఖాస్తులను స్వీకరించాలన్నారు. మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు, ప్రతి వంద మందికి ఓ కౌంటరును ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువ మంది వస్తే టోకెన్లు జారీ చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ప్రతి ఒక్కరికి రశీదును ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను జతపరచి తీసుకోవాలని సూచించారు. మండలంలోని 37 పంచాయతీల్లో జనాభా మేరకు కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీడియా, వైద్య సహాయక కేంద్రం, కౌంటర్లు, ఇతర దరఖాస్తుల కేంద్రం, సహాయ కేంద్రం, తాగునీరు, ప్రత్యేక మహిళా కౌంటరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి రోజు ఎప్పటికప్పుడు నివేదికను ఎంపీడీఓకు పంపాలని, తెల్లకాగితంపై దరఖాస్తు ఇచ్చిన స్వీకరించాలన్నారు. ముందస్తుగా గ్రామాల్లో టాంటాం వేయించి, దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి అందించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, ఎమ్మార్వో కిషన్, ఎస్సై కాశీనాథ్, మెడికల్ ఆఫీసర్ బుచ్చిబాబు, ఏవో నజీరొద్దీన్, ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్‌కుమార్, ఏపీవో నర్సింహులు, ఏపీఎం బాలయ్య, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు జాబ్ మేళా

**జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్**

వికారాబాద్, డిసెంబర్ 27 : జీ4ఎస్ సురక్షిత సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ సిబ్బంది, ఎస్కార్ట్ సిబ్బంది ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న జాబ్ మేళాను జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేళాలో వంద ఉద్యోగాల భర్తీకి ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పురుషులను మాత్రమే ఎంపిక చేయనున్నామని తెలిపారు. 18 నుంచి 35 ఏండ్ల అభ్యర్థులు, 10వ తరగతి నుంచి అంతకు మించి విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రఖ్యాత ప్రైవేటు పరిశ్రమల యజమాన్యం వారు తమ పరిశ్రమలకు అవసరమయ్యే సిబ్బందిని ఈ జాబ్ మేళా ద్వారా ఎంపిక చేసుకుంటారని తెలిపారు. జీతం నెలకు రూ.13వేల నుంచి రూ.17వేల వరకు అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.